# ఋణానికే

ద్వారం దగ్గర అడుగుల చప్పుడు విని, అంతవరకూ దీర్ఘంగా ఆలోచిస్తున్న ఇందిర ఓ నిట్టూర్పు విడిచి లేచి నిలబడింది.

"ఏమిటింకా డ్రస్ చేసుకోకుండా అలానే ఉన్నావ్. పిక్చరుకి రావాలని లేదా?" అనుకొంటూ లోపలికి వచ్చాడు చలపతి.

ఇందిర సమాధానం ఇవ్వలేదు. ఆయనకూ తనకూ మధ్య మిగిలిపోయిన దూరాన్ని అడుగులతో కొలుస్తున్నట్టు మెల్లగా దగ్గర కొచ్చి ఓ కవరు అతనికిచ్చింది.

"ఏమిటి?" ఆశ్చర్యంగా చూస్తూ అందుకున్నాడు.

"అప్లికేషన్ ఫారమ్"

"ఎందుకు?"

"ఉద్యోగానికి."

"ఎవరికి?"

"మీకే!"

చలపతి ముఖద్యుతులు మారాయి. ఓసారి భార్యను ఎగాదిగా చూసి కవరు నందుకొని కుర్చీలో కూలబడ్డాడు. ఏదో తప్పదన్నట్టు ఆ నాలుగు పేజీలు ఇటూ అటూ తిప్పేసి "ఊఁ" అన్నాడు విడుస్తున్న నిశ్వాసంలో విచిత్రంగా.

"రిజిస్టరు చెయ్యండి."

ఛప్పున తలెత్తి చూశాడు; నోట మాట పెగల్లేదు. కుర్చీలోనుంచి లేచిపోయి కాగితాన్ని టేబిలుమీద పడేసి సిగరెట్టు వెలిగించుకొంటూ కిటికీ వేపు నడిచాడు.

ఈ నిర్లక్ష్యం ఇందిరకు మహాకోపాన్ని కలిగించింది. ఎప్పుడు ఉద్యోగంమాట ఎత్తినా ఆయన ఇదే మానాన్ని ప్రదర్శిస్తారు. పోనీ వెనక పిల్లా పాళ్ళా గడించిపోయిన ఆస్తంటూ ఒకటివుండి ఇలా ఆటలాడితే ఒకమాట-అదికాదు! ఈవాళవుంటె రేపటికి నమ్మకంలేని బ్రతుకులు. ఏంచూసుకొని ఇంత ధీమానిర్లక్ష్యం? గోచీకి, అంగవస్త్రానికీ చాలని ఆ ఎకరంభూమీ చూసుకొనా ఈ పనికిరాని సుభాషితాలూ, ఆత్మాభిమానాలూ?

ఎంతయినా ఆవేశం ముంచుకొచ్చింది. కాని నిగ్రహించుకొని అడిగింది.

"ఏమంటారు?"

చలపతి ఆమెముఖాన్ని తప్పించుకొంటూ రెండోవేపునించి వెనక్కి తిరిగి తిన్నగా మళ్ళీ కుర్చీదగ్గరకు వచ్చాడు. ఏంచెప్పడానికీ తోచలేదు. ఆమె అడిగినపుడల్లా ఏదో ఒకసమాధానంచెప్పి తప్పించుకొంటూ వుండేవాడు. కాని ఈమధ్య కొంతకాలంగా ఇందిర కంఠంలో కోపాన్ని, కాఠిన్యాన్ని గ్రహించాక ఆమెదృష్టిని మరోవేపుకి త్రిప్పడానికి శతవిధాలా ప్రయత్నంచేసి విఫలుడయ్యాడు. మామూలుగానే ఈవాళకూడా పాతపాట పాడాలనుకున్నాడు. ఎందుకో మనస్సు సంకోచించింది. ఇక మిగిలిందల్లా ప్రాధేయపూర్వకంగా తనహృదయాన్ని విప్పి చెప్పుకోవడమే.

"ఉద్యోగం చెయ్యాలని లేదు ఇందిరా" అన్నాడు పొడిగా.

"లేదూ? ఏం?"

## యన్. ఆర్. నంది

నోటివరకూవచ్చిన జవాబుని క్రిందికిజారనిచ్చాడుకాదు. 'ఉద్యోగం బానిసచిహ్నం' 'ఉద్యోగంలోచేరాక వ్యక్తిత్వం చంపుకోవాలి ఇందిరా' 'ఆత్మాభిమానం పోయాక బ్రతికి యేంలాభం?' — ఇంకా వున్నాయి సమాధానాలు. కాని యివన్నీ పిరికివాళ్ళ చేతకానిమాటలని మొన్ననేగా అంది.

ఇందిరకు ఆపుకోలేని ఆగ్రహం వచ్చింది. దాన్ని అణచుకోవాలని ప్రయత్నాలు చేసేసరికి దుఃఖం ముంచుకొచ్చింది.

"ఉద్యోగం చెయ్యకండి. బ్రతుకు బ్రతుకంతా ఓ అభూతకల్పనలా బ్రతికెయ్యండి" అంటూ చెప్పింది.

చలపతి ఛప్పున వెనక్కి తిరిగాడు.

"ఈపాడు బ్రతుక్కి మాత్రం అప్పులుచేసి రంగులు వెయ్యడం నేర్చుకొండి."

"అప్పులా?"

"కాదు; భిక్షం..."

"ఇందిరా!"

"ఎందుకలా గొంతుక చించుకొని అరవటం? సోమేశ్వర్రావుగారి దగ్గర ఐదు వందలు అప్పు చెయ్యలేదూ?"

చలపతి షాక్ కొట్టినట్టు కొయ్యబారిపోయాడు.

"ఐదువందలు...సోమేశ్వర్రావు... నాకప్పిచ్చాడా?"

"ఒక్కసారే కాదు: నెలనెలా పాతిక్కో, ఏభైచొప్పున తీసుకొన్న డబ్బట. క్రితం వారం కూడా తీసుకున్నారట!"

చలపతి దిగ్భ్రమతో దిమ్మెక్కిపోయాడు. ఒక గుటకవేసి నోరావలించి అలా శిలాప్రతిమలా వుండిపోయాడు. అయితే... అయితే ఇదంతా సోమేశ్వర్రావు అప్పుగా రాసుకొంటున్నాడన్నమాట! గుండె ఆగినంత పనయింది. అలానే రామారావు, భానుమూర్తి, ప్రసాదరావు గూడా రాసుకొంటూవుంటే తను వాళ్ళ దగ్గరనుంచి తీసుకున్న డబ్బు ఈ పాటికి ఎంతయి వుంటుంది!? బెదురు చూపులతో గదినంతనీ కలియచూశాడు. ఇందిర కనిపించింది! ఏదో అంటోంది! వినిపించటంలేదు. ఏదో ఒక సమాధానం చెబితేనే గాని వాతావరణం మారేటట్లులేదు మెల్లగా ముందుకి రెండడుగులు వేసి వొణుకుతున్న కంఠంతో స్థయిర్యాన్ని నింపుకుంటూ అన్నాడు:

"ఆ డబ్బు నేనెప్పుడూ అతని దగ్గరనుంచి అప్పుగా తీసుకోలేదు ఇందిరా..."

అతనినోట్లో మాటలు నోట్లో వుండగానే ఇందిర ఆశ్చర్యంగా—"అప్పుగా తీసుకోలేదూ!" అంది.


"ఆఁ! స్నేహంపట్ల అడిగేవాణ్ణిగాని—"

"స్నేహమా? డబ్బుకీ స్నేహానికీ లంకె ఏమిటి?"

చలపతి తడబడ్డాడు.

"అసలు ఆయన దగ్గరనుంచి డబ్బు తీసుకోవాల్సిన అవసరమే మొచ్చింది? ఎందుకు?"

ఇలా సూటిగా ప్రశ్నించిందేకాని నిజానికి తనకికూడా వాటి సమాధానాలు తెలుసు. స్నేహితులదగ్గరనుంచి పదే పదే డబ్బు తీసుకోవడం, వాటిని తిరిగి ఇచ్చే బాధ్యతను మీద వేసుకోకపోవడం, ఇందిరకు సిగ్గనిపించేది. అయినా తన అభిప్రాయాన్ని భర్తకి చెప్పేది కాదు. ఈ మానం చలపతిని కొంతవరకు ప్రోత్సహించిందేమోనని అనుమానపడినపుడు




## ★ బదనిక ★

దగ్గరకు పిలిచి నాలుగు మాటలు అనాలనిపించేది. కాని ఎందుకో అతన్ని చూస్తే చాలు అతిజాలితో ఆర్ద్రమైపోయేది. ఇక యీనాడు సోమేశ్వర్రావు యింత చెప్పి వెళ్ళిన తర్వాతనైనా ముందు జాగ్రత్తకోసం ఆయన్ని హెచ్చరించకపోతే లాభం లేదని—

"నేనెందుకు చెబుతున్నానో కాస్త వినిపించుకోండి. ఉద్యోగాలు చేసేవాళ్ళంతా వ్యక్తిత్వాలని చంపుకున్నవాళ్ళు కారు. జీవితసత్యాన్ని తిరస్కరించి కృతకజీవితాన్ని గడపాలంటే ఎంత అసాధ్యమో ఆలోచించండి. కడుపుకోసం ఉద్యోగాలు చేయటం తప్పయినపుడు స్నేహితులనుండి డబ్బు తీసుకోవడం ఒప్పవుతుందా?" అంది.

"ఉన్నవాళ్ళ దగ్గరనుంచి డబ్బు కొంత తీసుకోవటం తప్పు కాదు ఇందిరా."

"సుభాషితాలు మాటాడకండి. మీలో కూడా వాళ్ళల్లా పరిపూర్ణ శక్తులున్నప్పుడు కృత్రిమత్వాన్ని కాంక్షించడమేమిటి?"




మరియు హైదరాబాదు.


చలపతి సమాధానం చెప్పబోయాడు కాని అంతలో రామారావు హిందుస్థానీ ఘజల్ పాడుకొంటూ రంగంలోకి ప్రవేశించడంతో మౌనం వహించాడు.

"అరె! మీరింకా టాయ్‌లెట్టే కాలేదు" అని తన ఆశ్చర్యాన్నంతని సిగరెట్టు పొగ మీద చూపిస్తూ వాళ్ళమధ్యకు వచ్చాడు.

ఇందిర మాటాడకండా లోపలికి వెళ్ళిపోయింది! చలపతి కూడా ఊనూరుమంటూ వ్రేళ్ళమధ్య నలిగిపోతున్న ధూమకాష్ఠాన్ని నిశ్శబ్దంగా కిందవిడిచి కాలితో రాసేస్తూ

"పదు" అని రామారావు భుజంమీద చెయ్యి వేశాడు.

"మరి ఇందిరగారు?"

"వంట్లో బావులేదట!"

రామారావు ముఖం చిన్నబుచ్చుకున్నాడు.

"మరి కొన్న టిక్కట్లు?"

"హాలుదగ్గర అమ్మేద్దాం."

ఈ బోడి సలహా అతనికి రుచించలేదు. కుర్చీలో కూలబడుతూ "అయితే మనమూ మానేద్దాం" అన్నాడు.

చలపతికి ఏం చెప్పడానికి తోచలేదు. క్షణం తటపటాయించి. "సరే! నువ్వు ఒప్పించగలిగితే ఒప్పించి తీసుకరా" అన్నాడు.

లోపలనుంచి ఈమాటలు విన్న ఇందిరకు ఎంతయినా కోపం వచ్చింది. తను పిక్చరుకి వస్తే, రాకపోతే ఈరామారావు కెందుకు? తను రాకపోతే అతనుకూడా రానని భీష్మించుక కూచోడంలో అర్థమేమిటి?

ఈయింట్లో ఆయన స్నేహితులకున్న చనువు, స్వేచ్ఛ యెంతటిదైనా కావచ్చు. కాని అవి తనమీదికి కూడా ప్రతిఫలింప చేయడం ఇందిరకు నచ్చలేదు. ఆయన తనకంతో స్వేచ్ఛనిచ్చారు. కాని దాని పరిణామం ఎంత ఘోరంగా తయారవుతుందో ఆయన వూహించలేకపోయారు!

"వదినగారూ"

గతుక్కుమంది. రామారావ్! చప్పున లేచి నిలబడింది.

"మీ వంట్లో ఎలా వుంది?"

బాగానే వుంది! తనకేం జబ్బని? ఆయనన్నది అబద్ధం. అంత అబద్ధం చెప్పవలసిన పరిస్థితి ఎందుకు కలిగింది?

"కాస్త...తలనొప్పిగా వుంది..." అనేసింది అప్రయత్నంగా; నవ్వుకుంది మనస్సులో. ఎంత సునాయాసంగా, అప్రయత్నంగా తనూ అబద్ధమాడేసింది.

"మందేదైనా—"

"అక్కర్లే అవసరంలేదు; దానికదే తగ్గిపోతుంది లెండి"

మరో క్షణం అలా నిలబడితే నిజంగా తలనొప్పి వచ్చేటట్లు వుంది. ఆ మనిషి తనను ఎందుకలా పట్టి పట్టి చూస్తాడు - ఆడదాని ముఖమే ఎప్పుడూ చూడనట్టు? 'దయచేసి బయటకు వెళ్ళండి' అని ఎలా చెప్పడం? పెద్దమనిషి, లక్షాధికారి, పెద్ద సంస్కృతిపరుడు—

"నాకోసం మీరు పిక్చరుకి వెళ్ళడం మానకండి రామారావుగారూ" అని మెల్లగా వంట గదిలోకి వెళ్ళిపోయింది—అతన్ని అక్కడినించి పంపించివేసే ఉపాయం అదొక్కటిగానే కనిపించింది.

నిట్టూర్పు వినిపించింది.

క్రమేపీ అడుగులశబ్దం దూరమయింది...

కొన్ని క్షణాల నిశ్శబ్దం తర్వాత ఆయన గదిలోనుంచి మాటలు వినిపించాయి:

"రేపు మద్రాసు వెడుతున్నా పనిమీద; ఇదుగో నువ్వడిగిన ఏభైరూపాయలు. మరి ఈ వాళకు సినీమా ప్రోగ్రామ్ కాన్సిల్." అని రామారావు గొంతుక.

తర్వాత అడుగుల చప్పుడు.

నోట్లని ఛప్పున జేబులో కుక్కుకున్న చలపతిని చూసి అసహ్యం, దుఃఖం, కోపం, కృచ్ఛ్రిం ముంచుకొచ్చాయి ఇందిరకు. కళ్లు మూసుకొని పరుపుమీద వాలిపోయింది

మర్నాడుప్రొద్దుట మామూలుగానే ఇందిర కాఫీచేసి చలపతికిచ్చింది. అతను కప్పు అందుకున్న వెంటనే వెనక్కి తిరిగిపోయింది.

"ఇందిరా"

ఆగింది.

కాఫీకప్పు టేబిలుమీదపెట్టి దగ్గరకువస్తూ "కోపమా?" అన్నాడు.

"అబ్బే" అని చరచర లోపలికి వెళ్ళిపోయింది.

చలపతి చాలా బాధపడ్డాడు. మనస్సంతా వికలమయింది. సిగ్గుతో నిలువెల్లా కంపించిపోయాడేమో, శరీరంలోని రక్తమంతా పాదాల్లోకి పరుగులుతీసింది. నిట్టూర్పువిడిచి కాఫీ తాగకండానే బయటకు వెళ్ళిపోయాడు.

దారిపొడుగునా ఇదే ఆలోచన: ఇందిర తనని అసహ్యించుకొంటోందా? తనని అర్థం చేసుకోలేకపోతోందా? అర్థం కాకపోవడానికి తనంత అర్థంకానిమనిషా?

గృహవిషయాలమీద ఆడవాళ్ళకు సహజమైన భీతి వుంటుందంటారు. అందుకేనా ఇందిర తన ఉద్యోగవిషయమై ఇంతగా హెచ్చరిస్తోంది? రెండుప్రాణాలకి మహా అయితే ఏభైరూపాయలు కావాలి నెలకు. స్వంతానికింత యిల్లువుంది. పదీపాతికా రైతులు పంపిస్తున్నారాయెను. ఇహ తమకు కావలసిందేవిఁటి?

ఎన్ని వున్నా చలపతికి జీవితంలో ఏదో కొరత వున్నట్టు అనిపించేది. దాని స్వరూపాన్ని నిర్ణయించుకొనే శక్తి లేకపోయినా అది ప్రతీక్షణం బాధపెట్టేది అతన్ని.

ఉద్యోగం చెయ్యకపోతే బ్రతకడమెలా అని చాలాసార్లు అనుకున్నాడు. కాని తనకున్న ధనవంతులైన స్నేహితుల్ని చూశాక ఆ భావం దానికదే తుడిచిపెట్టుకపోయేది. తను వాళ్ళను అడిగినదే తడవుగా ఎంతయినా డబ్బు యిచ్చేవారు. అయితే వాళ్ళని తను అర్థిస్తున్నట్టుగావి, వాళ్ళు తనకిచ్చేది ధర్మమునిగాని ఒకనాడూ భావించలేదు.

ఛప్పున ఆగిపోయాడు—ఎవరిదో చెయ్యి భుజంమీద బరువుగా పడడంతో,

"ఎక్కడికోయ్ అంతకంగారుగా పోతున్నావ్?" అన్నాడు ప్రసాదరావు.

"అహఁ ఎక్కడకూ కాదు—అలా ఊరికే బయలుదేరా."

"ఇంత ప్రొద్దుటా?"

చలపతి సమాధానం చెప్పలేదు.

ఇద్దరూ కొంతదూరం నడచారు.

"ఇందిరకు ఒంట్లో బాగులేదట!"

ఛప్పున కనురెప్పలెత్తి చూశాడు చలపతి స్నేహితుని ముఖంలోకి.

"ఇందిరకేం జబ్బు? అబ్బే బాగానే వుందే!" అన్నాడు ఆశ్చర్యంగా చలపతి.

"అహా, రాత్రి రామారావు అంటే అడుగుతున్నా!"

చలపతి తలవూంచుకున్నాడు. అవును! నిన్న తనేగా ఇందిరకు బాగులేదని రామారావుతో చెప్పాడు! నిన్న జరిగిన విషయాలన్నీ ఒక్కటే ఒక్కటి జ్ఞప్తికి రాసాగినై.

"ప్రసాద్! ఒక విషయం నిన్నడగాలని వుంది" అన్నాడు మెల్లగా.

"ఏవిటి?...డబ్బేమన్నా...?"

"కాదు...ఇంతవరకు నువ్వు నాకిచ్చిన డబ్బెంతో జ్ఞాపకముందా?"

"లేదు"

"రాసుకోలేదు?"

"లేదు"

"ఏం?"

ప్రసాదరావుకి సమాధానం ఛప్పున స్ఫురించలేదు.

"సోమేశ్వరరావు మాత్రం రాసుకుంటున్నాడు. అతని కిప్పుడు అయిదువందలు నేను ఋణపడి వున్నట్టు లెఖ్ఖ. అలానే నీకుకూడా నేనెంతివ్వాలో చెప్తే—"

ప్రసాదరావు అతని మాటలకు అడ్డొస్తూ "నేనా డబ్బుని నీకెప్పుడూ అప్పుగా యివ్వలేదే!" అన్నాడు.

"మరి?"

"స్నేహితుడవని—"

చలపతి ఒకగుటక వేసి మెల్లగాఅన్నాడు: "ఇకనుంచి నేనడిగినా యివ్వకండా వుండగలవా?"

ప్రసాదరావు ఆశ్చర్యపోతూ "ఏం?" అన్నాడు.

"మీదగ్గరనుంచి నేను డబ్బు తీసుకుంటున్నానేగాని ప్రతిగా మీకేం ఇవ్వడంలేదు. అలాంటప్పుడు ఏం బాగుంటుంది?"

ప్రసాదరావు చిరునవ్వు నవ్వాడు.

"ప్రతిగా నువ్వు నాకేం యివ్వలేకపోతున్నావనే ఈ బాధంతా? ఫర్వాలేదులే—" అని భుజం తట్టి వెళ్ళిపోయాడు.

ఆ నవ్వు చాలా వింతనిపించింది చలపతికి. ఏవో అర్థాలు వుండొచ్చనుకొని వెంటనే నాలిక కొరుక్కున్నాడు.

మధ్యాహ్నం ఇంటికి తిరిగి వచ్చేటప్పుడు ఓ జార్జెట్ చీర పాకెట్‌తో సయితం తిరిగి వచ్చాడు. వస్తూనే వంటింట్లోకి వెళ్ళి ఇందిరకు అందించాడు.

"ఎక్కడిది?" అంది.


నేషనల్ ఇంజనీరింగ్ కంపెనీ (మద్రాసు) ప్రైవేట్ లి॥

379, నేతాజీ రోడ్, మద్రాసు-1.

మెసర్సు : స్ట్రోయెక్స్‌పోర్ట్, జకోస్లవేకియా వారికి

దక్షిణ ఇండియా కంతటికి సోల్ ఏజెంట్లు

* స్కోడా ఇంజనులు *

పారిశ్రామిక, వ్యవసాయిక, నౌకా సర్వీసులకు

2,000 H. P. వరకు

* జనరేటర్లు *

షేవనరీ మరియు, పోర్టబుల్

1250 KVA వరకు

ప్రతిజిల్లా ఏజన్సీ దరఖాస్తులు కోరడమైనది.

# బదనిక

"కొన్నాను."

"డబ్బు?"

"రైతు పంపించాడు."

అది పచ్చి అబద్ధమని ఇందిర గ్రహించక లేకపోలేదు. విహ్వలంతో ముఖమంతా మారిపోయింది. ఇక తానేం ఆయనకు చెప్పదలచుకోలేదు. చెప్పి ఆయనతో మాట్లా తీసుకరావడం కష్టమని గ్రహించింది. భవిష్యత్తు మీద భారాన్ని వేసి మౌనంగా వుండాలని నిశ్చయించుకొంది.

నిర్లక్ష్యంగా ఇందిర అక్కడనుంచి వెళ్ళిపోవడంతో చలపతి క్రుంగిపోయాడు. అసలక్కడికి సగం భయంతోనే వచ్చాడు. నిన్న జరిగిన కలహాన్ని ఈ చిన్న బహుమానంతో కప్పివేయాలనుకున్నాడు. కాని ఫలితం వ్యతిరేకం కావడంతో మరింత భయపడి కొన్నాళ్ళవరకు ఆమె యెదుట నిలబడ్డానికే సాహసించలేకపోయాడు.

మారిన అతని ప్రవర్తనకు ఇందిరకూడా చాలా బాధపడింది. తనతో అతను మాటాడకండా వెళ్లిపోతున్న క్షణాలు జ్ఞప్తికి వచ్చిన పుడల్లా కడుపు దేవినటనిపించేది. తలగడలో ముఖం దాచుకుని ఏడ్చుకునేది.

ఒకనాడు యిహ మరి ఆగలేక ఒక నిశ్చయానికి వచ్చింది. సాయంకాలం అతను బట్టలు వేసుకొంటూంటే అతని దగ్గరకు వెళ్ళి:

"నేను రాజమండ్రి వెళ్ళిపోతున్నాను." అంది.

దెబ్బతిన్నవాడిలా ఉలిక్కిపడ్డాడు. ఛప్పున వెనక్కి తిరిగాడేగాని ఆ మానిని ముఖంలోకి చూసే ధైర్యం చాలక తల వంచుకొని:

"ఎప్పుడు?" అన్నాడు.

"ఈ బండికే!"

కొన్ని క్షణాలు నిశ్శబ్దం. తర్వాత ఉడిగిపోతున్న శక్తులన్నిటిని కూడగట్టుకొని అడిగాడు. సగం స్వగతంగా.

"ఎందుకు?"

"ఆ సమాధానం మీకు తెలుసు" అని




చరచరా వంటింట్లోకి వెళ్లిపోయింది.

కొంతసేపయాక పెట్టిపట్టుకొని మధ్యగదిలోని వచ్చేసరికి చలపతి లేడు. దుఃఖం, కోపం, ఆవేశం ముంచుకొచ్చాయి. మనిషు్ని శాంతించేవరకు తల గోడకేసి కొట్టుకోవాలన్నంత ఉద్రేకం వచ్చిపడింది. కాని అంతలో—

"ఏమిటి, ఎక్కడికి ప్రయాణం వదిన గారూ?" అనుకొంటూ రామారావు రావడంతో కళ్ళల్లో నిలచిన నీటిబిందువులను తుడుచుకోడానికి ప్రయత్నించింది.

ఈ దృశ్యాన్ని రామారావు చూశాడు. సిగరెట్టు పారేసి దగ్గరగా వచ్చి

"చలపతి ఏమన్నా అన్నాడా?" అన్నాడు ఆమె ముఖంలోకి సూటిగా చూస్తూ.

"అబ్బే, లేదండి".

"మరి?"

ఇందిర సమాధానం చెప్పలేదు. లోపలికి వెళ్ళిపోయే వుద్దేశంతో వెనక్కి తిరిగేసరికి రామారావు గబ్బున ఆమె చెయ్యిపట్టుకొని:

"నాకు తెలుసు ఇందిరా నీ బాధ. చలపతిని కట్టుకున్నందుకు నువ్వెంతగా కృంగిపోతున్నావో నా కర్థం కాలేదనుకోకు." అన్నాడు.

ఇందిరకు అంతా అయోమయంగా అనిపించింది. ఏమిటి తన ఉద్దేశ్యం ఇలా అనటంలో? భయంతో నిలువెల్లా కంపించిపోతూ అతని చేతిలోనుంచి తప్పించుకొంది.

"క్షమించండి, నే నెప్పుడూ బాధపడటం లేదు" అంది. రామారావు అదోలానవ్వాడు.

"ఇలా ఆత్మవంచన చేసుకొని ఎన్నాళ్ళుండ గలవ్?"

"నే నేం ఆత్మవంచన చేసుకోవటం లేదు"

"నా మాట విను ఇందిరా. ఆడవాళ్ళకు అందం ఆభరణం. మగాడికి డబ్బు దివ్యత్వాన్నిస్తుంది. దరిద్రుడైన భర్తదగ్గర నీ అందాన్ని నాశనం చేసుకోనేకంటే ఆత్మవంచన యింకేముంటుంది"?

"నా అందానికి మీరు జాలిపడనవసరం లేదు. వెళ్ళండి. లేకపోతే కేకలువెయ్యాల్సి వస్తుంది."

రామారావు విరగబడి నవ్వాడు. ఏమనుకున్నాడో వెళ్ళిపోయేటట్టు వెనక్కి తిరిగి గబ్బునవచ్చి ఇందిరను రెండు చేతులతో బంధించివేశాడు. భయభ్రాంతులతో ఇందిర గొంతుక పూడుకుపోయింది. కౌగిలి మరింత బిగిసింది. ఇందిరకు శ్వాస ఆగినంతపనయింది.

తలుపులు భళ్లున తెరచుకున్నాయి.

కౌగిలి విడిపోయింది.

ద్వారందగ్గర సోమేశ్వర్రావు, చలపతి!

రామారావు నిలువెల్లా కంపించిపోయాడు.

ఇందిర నిలబడ్డపాటున కుప్పలా కూలిపోయింది. చలపతి పరుగున వచ్చి పట్టుకున్నాడు.

ఇందిర చిన్నపిల్లలా ఏడ్చింది. ఓదార్చబోయిన చలపతిని నెట్టివేసింది. సోమేశ్వర్రావు ద్వారం దగ్గరే అలా నిలబడిపోయాడు.

ఇందిర కళ్లుతుడుచుకొంటూ లేచి నిలబడి "ఈ యింట్లో మీరు నాకూ, మీ స్నేహితులకూ యిచ్చిన స్వేచ్ఛకి పర్యవసానం యిది." అంది వణికే కంఠంతో.

సోమేశ్వర్రావు దగ్గరగా వచ్చాడు. ఇదే సమయమన్నట్టు రామారావు మెల్లగా జారుకున్నాడు. ఇందిర దుఃఖాన్ని ఆపుకుంటూ "నేను వెళ్ళిపోతున్నాను మా యింటికి" అంటూ పెట్టె తీసుకొని వెళ్ళిపోయింది బయటకు.

చలపతి ఈ దెబ్బనుంచి తేరుకునేసరికి సోమేశ్వర్రావు చెయ్యి అతని భుజం మీదవుంది.

"ఇందిర వెళ్ళిపోతోంది" అన్నాడు అస్పష్టంగా.

"వెళ్లనియ్."

"వీల్లేదు."

"నువ్వామెను వెనక్కి తీసుకరాలేవు."

"తీసుకొస్తాను."

"సరే, తీసుకొచ్చి ?"

చలపతిరావు విచిత్రంగా సోమేశ్వరావు వైపు చూశాడు. సోము నవ్వుతూ భుజం తట్టాడు.

"నువ్వు పిరికివాడవు చలపతీ. జీవితాన్ని ఎదుర్కోవడం నీకు చాతకాదు. అందుకని రూపసి అయిన భార్యను ముందు పెట్టుకొని ఆమె ద్వారా, ఆమె నీడక్రింద బదనికలా బ్రతకాలనుకున్నావ్. కాని నీకు లేని ఆత్మాభిమానం ఆవిడకుంది."

చలపతి నోరావలించి ఆశ్చర్యంగా చూడ మొదలుపెట్టాడు.

"స్నేహితులకు ఆమెను పరిచయంచేసి, ఆ స్నేహంతో మమ్మల్ని వంచించబోయావు. నీ చేతకానితనాన్ని ఆధారంగా తీసుకొనే రామారావు ఈవాళ ఇంత అఘాయిత్యానికి తలపడ్డాడు. నా కివన్నీ తెలిసే నిన్ను హెచ్చరించడం కోసం నాకు నువ్వు అయిదు వందలు యివ్వాలని ఇందిరతో చెప్పి ఆ భయంతోనైనా ఉద్యోగంలో చేరతావని అప్లికేషన్ ఫారమ్ తెచ్చాను. కాని నువ్వేంచేశావ్ ?"

చలపతి ఎటూ చెప్పలేక చప్పున సోము రెండు చేతులూ పట్టుకొని:

"నన్ను క్షమించు సోమూ! నిన్నర్థం చేసుకోలేకపోయాను" అంటూ, సోము సమాధానమైనా వినకుండా స్టేషనువేపు పరుగెత్తాడు. ★


# కాల్గేట్ క్లోరోఫిల్ చిగుళ్లను గట్టిపరుస్తుందని

## వైద్యపరీక్షలో రుజువైంది!



**చిగుళ్లను బలపరుస్తుంది!**

కాల్గేట్ క్లోరోఫిల్ టూత్‌పేస్ట్‌తో రోజూ పళ్లను క్రమంతప్పకుండా తోముకుంటే చిగుళ్లు గట్టిపడడానికి అవసరమైన జీవకణాలు పెరుగగలవు.

**దుర్గంధాన్ని వెంటనే,గట్టిగా నిర్మూలిస్తుంది!**

ఇతర మామూలు టూత్ పేస్ట్‌లకంటే కాల్గేట్ క్లోరోఫిల్ టూత్‌పేస్ట్ దుర్గంధాన్ని గట్టిగా నిర్మూలించగలదని ఇటీవల జరిగిన పరీక్షలో రుజువైంది.

**దంతక్షయాన్ని నివారిస్తుంది!**

భుజించగానే కాల్గేట్ క్లోరోఫిల్ టూత్‌పేస్ట్‌తో పళ్లు తోముకుంటే పళ్ల మెరుగును హరించే ఆమ్లాలను తగ్గించి, తద్వారా దంతక్షయాన్ని నివారించగలదు!

**ఇంతకు మించి సచేతనమైన క్లోరోఫిల్ కలిగివున్న మరొక టూత్‌పేస్ట్‌లేదు**




* నీటిలో కరిగే క్లోరోఫిలిన్స్ గలవు.

**ఇప్పుడు!** ఆదాయకరమైన పెద్దసైజులో దొరుకుతుంది

కాంక/8/583